క్లుప్తంగా

పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన




మాట్లాడుతున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

మహారాణిపేట: ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్లు, ఇతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగనున్నట్లు జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు విషయాలపై కూలంకషంగా చర్చించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం చర్చించిన అంశాలను వివరించారు. పెండింగ్ డిమాండ్లు, డీఏ బకాయిలు, కొత్త పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతం పెంపు తదితర డిమాండ్లపై చర్చించామన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేసేందుకూ వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, జిల్లా ట్రెజరీ అధికారి జె.సత్యారావు, సంఘం కోశాధికారి టి.గోపాలకృష్ణ, అగర్వాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఎస్‌కే ఆడమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

దాబాగార్డెన్స్: వచ్చే నెల 9న సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ గురువారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ వంటి వాటిపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, పీఎంయూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. భక్తులు నడిచే దారి పొడవునా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ బయాలజిస్ట్ విభాగం అవసరమైన చోట్ల దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం



ఉన్మత్త వారాహి మాత అలంకరణలో వారాహి మాత

అల్లిపురం: శ్రీమేరు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారు ఉన్మత్త వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు దీక్షాధారులు అమ్మవారి దీక్షను స్వీకరించారు. అమ్మవారికి ఉదయం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లిపురం, వివేకానందకాలనీ, నీలమ్మ వేపచెట్టు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.

రోడ్లపై చెత్త వేయరాదు



కొబ్బరితోట గెడ్డ వద్ద రోడ్డుపై చెత్త వేయటాన్ని ప్రశ్నిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం: రోడ్లపై చెత్త వేయరాదని, క్లాప్ వాహనాలు వచ్చినప్పుడు వాటికి అందించాలని జోన్–4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. గురువారం ఆయన అల్లిపురం మెయిన్‌రోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్, గీత్ సంగీత్ రోడ్డు, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో పారిశుధ్య కార్మికుల పనితీరుపై పరిశీలించారు. వార్డు ప్రజలు చెత్తను రోడ్లపై వేయటం చూసిన ఆయన చెత్తను రోడ్లపై వేయరాదని వారించారు. పారిశుధ్య కార్మికులతో పాటు క్లాప్ వాహనాన్ని కూడా పంపించాలని, చెత్త సేకరించి అందులోనే వేయాలని, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. పర్యటనలో ఆయన వెంట అధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

- నేటి నుంచి వచ్చే నెల 7 వరకు జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు
- ఆధ్యాత్మిక కేంద్రంగా టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణం
- దశావతారాల్లో భక్తులకు కనువిందు చేయనున్న సుభద్రా, బలభద్ర సమేత జగన్నాథుడు
- ఏర్పాట్లు పూర్తి : ఆలయ ఈవో రాజగోపాలరెడ్డి



రథయాత్ర సందడి

దాబాగార్డెన్స్: జగన్నాథ రథయాత్ర సందర్భంగా దక్షిణ నియోజకవర్గం శుక్రవారం నుంచి ఆధ్యాత్మిక..సాంస్కృతికంగా పది రోజుల పాటు వెల్లివిరియనుంది. రథయాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వివిధ దేవాలయాలు ఉవిళ్లూరుతున్నాయి. నగరంలో 185 ఏళ్ల ఘన చరిత్ర గల పురాతన టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథుని రథయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్ నిర్వహించనున్న రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథస్వామిని రథంపై ఊరేగించనున్నారు. ఇదిలా ఉండగా.. టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథుడిని ఉదయం 9.10 గంటలకు రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5 గంటలకు టౌన్ కొత్తరోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా టర్నరు సత్రం వరకు వేదపారాయణ, గీతాపారాయణ, మేళతాళాలతో అత్యంత వైభవంగా స్వామి తొలి రథయాత్ర నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీలో స్వామి దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

28న మత్స్యావతారం, 29న కూర్మావతారం, 30న వరాహావతారం, జూలై ఒకటిన నృసింహావతారం, 2న వామనావతారం, 3న పరశురామావతారం, 4న శ్రీరామావతారం, 5న బలరామ, శ్రీకృష్ణావతారం, 6న తొలి ఏకాదశి శేషపాన్పు అవతారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. 7 ఉదయం 9.45 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళ తాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ జగన్నాథ నామస్మరణతో వేద పండితుల పారాయణాలతో అత్యంత వైభోవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు.



టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాట్లు పూర్తి



దాదాపు పూర్తయిన క్యూలైన్ల ఏర్పాటు

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవం పూరీ జగన్నాథస్వామి రథయాత్ర రీతిన పవిత్ర ఆషాఢ శుక్ల ద్వితీయ తిథి (27న) విశాఖ మహానగరంలో 18వ సారి అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే జగన్నాథ, బలదేవ, సుభద్రాదేవిని వేర్వేరుగా మూడు రథాలపై ఒకేసారి ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. మరో చిన్న రథంపై ఇస్కాన్ సంస్థాపకాచార్యుడు శ్రీల ప్రభుపాదుల విగ్రహ మూర్తిని ఏర్పాటు చేయనున్నారు. రథయాత్ర అలంకరణకు ఒడిశాలోని పిప్పిలి నుంచి ప్రత్యేక అలంకరణ సామగ్రి తీసుకొచ్చారు. రథయాత్రలో ఉపయోగించే రథాలు ప్రత్యేకంగా యంత్ర నిర్మితమై 37 అడుగుల రథ గోపురాన్ని కలిగి ఉన్నాయి. సాయంత్రం 4 గంటలకు పాతజైలు రోడ్డు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు ఎదురుగా గల పార్కింగ్ ఏరియా నుంచి బయలుదేరి, ఎల్‌ఐసీ అంబేడ్కర్ కూడలి, డాబాగార్డెన్స్, ప్రెస్‌క్లబ్ జంక్షన్, జగదాంబ జంక్షన్ నుంచి వైఎస్సార్ విగ్రహ కూడలి మీదుగా వాల్తేర్ అప్ రోడ్డు సెవెన్‌హిల్స్ మీదుగా సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు సాగనుంది. దారి పొడవునా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, బెంగాల్, ఒడిస్సా నుంచి వచ్చిన భక్తులు నృత్య కీర్తనలు చేయనున్నారు. కోలాట మండలులు కోలాటం చేస్తూ జగన్నాథుని రథయాత్రకు మరింత శోభ తీసుకురానున్నారు. రథయాత్ర గురజాడ కళాక్షేత్రం చేరుకున్న తర్వాత సాంబదాస్, నితాయి సేవినీ మాతాజీ జగన్నాథస్వామి లీలా విశేషాలు అందించనున్నారు. అనంతరం భక్తులు జగన్నాథ స్వామికి ప్రేమ పూర్వక హృదయాలతో చేసిన 1008 రకాలైన ప్రత్యేక వంటకాలు అర్పించనున్నారు.

వేడుకగా జగన్నాథస్వామి శాంతి కల్యాణం



బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి వారి శాంతి కల్యాణోత్సవం

టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథ స్వామి ఆలయంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా లోక కల్యాణార్థం గురువారం బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి వైఖానస ఆగమ సాంప్రదాయ రీతిన శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో ఆలయ అర్చకులు రంగనాథ ఆచార్యులు, జగన్నాథాచార్యులు వేడుకగా స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది ప్రసాద్, సీహెచ్ శ్రీరామ్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి..



టౌన్ కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రథయాత్ర ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీ వద్ద ముగియనుంది. శనివారం నుంచి వచ్చే నెల 7 వరకు స్వామి దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న దృష్ట్యా క్యూలైన్లు, బారికేడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఉంటుంది. వివిధ శాఖల నుంచి పలువురు సిబ్బందిని నియమించాం. ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నాం. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించనున్నాం. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.200 టికెట్లపై ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నాం.

– టి. రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో

పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆయాలు, కుకింగ్ హెల్పర్లు

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వేలాది మంది ఆయాలు, కుకింగ్ హెల్పర్లకు మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని బాధితులు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ ప్రమీల ఆధ్వర్యంలో నాయకురాళ్లు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ పేదవారైన ఆయాలకు ఇచ్చే రూ.6 వేలు, కుకింగ్ హెల్పర్ల ఇచ్చే రూ.3 వేలు ప్రతి నెల ఇవ్వక పోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయాలకు మార్చి, ఏప్రిల్, మే నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు. వీరు పాఠశాలల్లోని గదులు, లెట్రిన్‌లను రోజుకు మూడు నాలుగు సార్లు శుభ్రం చేస్తూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. అయితే వీరి పట్ల ప్రభుత్వ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆమె విమర్శించారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఆయాలకు రూ.15 వేలు, కుకింగ్ హెల్పర్లకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన ప్రతినిధి బృందంలో నాయకురాళ్లు కె. కొండమ్మ, కాకినాడ రాజేశ్వరి, రేగాని లక్ష్మి జి. లక్ష్మి తదితరులు ఉన్నారు.

వీధి విక్రయదారుల కమిటీ ఏర్పాటు



కమిటీ పత్రాన్ని జెడ్సీకి అందజేస్తున్న వెండర్లు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో వీధి విక్రయదారుల కమిటీ ఏర్పాటైంది. గురువారం జోనల్ కార్యాలయంలో జెడ్సీ ఎం.మల్లయ్యానాయుడు ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. జోన్ పరిధి 12 వార్డుల్లో 2200 మంది సభ్యులను సెక్రటరీలు గుర్తించారు. వారందరు కమిటీలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే, జోనల్ అధికారులు, స్ట్రీట్ వెండర్స్ మొత్తం ఎనిమిది మంది శాశ్వత సభ్యులుగా కమిటీ ఏర్పాయింది. ఎవరైన స్ట్రీట్ వెండర్‌గా నమోదు కావాలన్నా, కొత్తగా ఆయా వీధుల్లో వ్యాపారం చేసుకోవాలన్నా వెండర్ కార్డులు పొందాలని, ఇందుకు కమిటీ ఆమోదం తప్పకుండా ఉండాలని తీర్మానించారు. అలాగే సమస్యలు వస్తే కమిటీ ద్వారా పరిష్కరించుకోవాలని కమిటీ సూచించింది.

అంబేడ్కర్ ఆశయాల దిశగా వైఎస్సార్‌సీపీ పయనం



వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న ముత్తాబత్తుల రమేష్ తదితరులు

దాబాగార్డెన్స్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 33వ వార్డు అధ్యక్షుడిగా నియమితులైన ముత్తాబత్తుల రమేష్ గురువారం వార్డు నాయకులతో కలిసి వాసుపల్లిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో జగన్‌మోహన్‌రెడ్డి పేదలు, అణగారిని వర్గాలకు ప్రభుత్వ పథకాలు ద్వారా చేయూతనందించారన్నారు. 33వ వార్డులో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎస్సీ వర్గానికి చెందిన ముత్తాబత్తుల రమేష్‌ని అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. వార్డులో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు రమేష్ వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల రవీంద్రభరత్, దశమంతుల చిన్ని, ముజీబ్‌ఖాన్, బీశెట్టి ప్రసాద్, బెవర మహేష్, ఆకుల శ్యామ్, తాడి రవితేజ, పచ్చిరపల్లి లక్ష్మీ రాము, సూర్యనాయుడు, బూర్గుల చిన్న, ఆడారి వెంకట మహేష్, పీవీఎన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సంతోష్, సుగుణకుమార్, శివ సంతోష్, లక్ష్మీకాంతం, కొల్లి సత్యవతి, చంద్రకళ, హేమ, శిరీష, మంగం పార్వతి, పులి, రంజిత్, సత్తిబాబు, సతీష్, మహేష్, రాజేష్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి 16 రోజుల పండగ



అమ్మవారి తాంబూలాలు తీసుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో ఉత్సవ మూర్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవం ఈ నెల 11వ తేదీన అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా కల్యాణం జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం ఆలయంలో పదహారు రోజుల పండగ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. అనంతరం పుణ్య స్త్రీలకు దక్షిణ, తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తాంబూలాలు అందుకున్నారు.

'మనో జలధి' పుస్తకావిష్కరణ

సీతంపేట: డాక్టర్ కొణపల విశ్వేశ్వరరావు రచించిన 'మనో జలధి' కవితా సంపుటి ఆవిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడులను విశ్లేషించే గుణం కలది ఈ మనో జలధి కవితా సంపుటిలో ఉందన్నారు. రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. శేఖరమంత్రి ప్రభాకర్, ఆచార్య దాసు మధుసూదనరావు, ఉప్పల అప్పలరాజు, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్



సాహు మహారాజ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శివప్రసాద్ తదితరులు

అల్లిపురం: రిజర్వేషన్ల పితామహుడు కొల్హాపూర్ సంస్థానాధిపతి సాహు మహారాజ్ అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోశాధికారి పెదపెంకి శివప్రసాదరావు అన్నారు. సాహు మహారాజ్ 151వ జయంతి నగరంలో పార్టీ కార్యాలయంలో జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా సాహు మహారాజ్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో మొదటిసారి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత సాహు మహారాజ్‌దే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎ.రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి సవరాలు రమేష్, గాజువాక అధ్యక్షుడు నందికోళ్ల అప్పారావు, ఈస్ట్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.నారాయణ, గాజువాక అసెంబ్లీ ఉపాధ్యక్షుడు దేవరపల్లి శరత్, చోడవరపు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



డాక్టర్ అంగముత్తుతో చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



పోలీస్ కమిషనర్‌కు పూలమొక్క అందజేస్తున్న జీవీఎంసీ కమిషనర్ గార్గ్

దాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ డాక్టర్ అంగముత్తును జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరు విశాఖ అభివృద్ధిపై చర్చించుకున్నారు.

పోలీస్ కమిషనర్‌తో భేటీ.. : పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. జీవీఎంసీ అభివృద్ధిలో భాగంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ తదితర సమస్యలపై చర్చించుకున్నారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు మారీటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం తెలిపారు. పోర్టు అథారిటీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల సహకారంతో 27 సంవత్సరాలలోపు వయస్సు గల బీటెక్ మెకానికల్, ఇంజినీరింగ్ డిప్లొమా, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, ఇంటర్, డిగ్రీ, పదో తరగతి ఉత్తీర్ణులైన విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల ప్రజలు, కోటవీధి, పాత పోస్టాఫీసు, జాలారిపేట, అల్లిపురం, కొబ్బరితోట, మహారాణిపేట, పందిమెట్ట, జ్ఞానాపురం,75 ఫీట్ రోడ్డు, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ, గొల్లవీధి, కేజీహెచ్ తదితర ప్రాంతాల యువతీ యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధికి సహకారం అందిస్తామన్నారు. ఈ ప్రాంతాలకు చెందిన తెల్ల రేషన్‌కార్డు కలిగిన అభ్యర్థులు జూలై 5వ తేదీలోగా విశాఖలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సింధియా జంక్షన్‌లో ఉన్న సీఈఎంఎస్ కేంద్రాన్ని 8688411100, 0891–2704010 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మాట్లాడుతున్న మెరైన్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీవీ యాదవ్



పోలమాంబ ఆలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



ఎలియన్స్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మెరైన్ పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీవీ యాదవ్ అన్నారు. గురువారం ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మత్తుతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. డ్రగ్స్ అలవాటు బారి నుంచి స్నేహితులను, కుటుంబ సభ్యులను, కాలేజీ యువతను రక్షించడానికి సహకారం అందించాలన్నారు. డ్రగ్స్ రక్కసిని అంతమొందించే దిశలో విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినా, అక్రమ రవాణా చేసినా, టోల్ ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పోర్టు మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యరహిత జిల్లాయే లక్ష్యం

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెదవాల్తేరు పోలమాంబ టెంపుల్ నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఈఎన్‌టీ ఆస్పత్రి వరకు సాగింది. అనంతరం ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడారు. జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయట పడడం కోసం మందులు ఏ విధంగా సహకరిస్తాయో తెలిపారు. అనంతరం ఎన్జీవో సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మత్తు మందుల వాడకం, అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోణంకి రమేష్, డాక్టర్ హరికృష్ణ, ప్రభుత్వ మానసిక వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రవణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, సమిత ప్రాజెక్టు డైరెక్టర్ డి.వీరభద్రరావు, జిల్లా సీపీఎం ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ బద్రి, సమిద స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, వివిధ ఎన్జీవోలు, నర్సింగ్ స్టూడెంట్లు, కమ్యూనిటీ సభ్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

దాబాగార్డెన్స్: ఎలియన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ బిజినెస్ కళాశాల ఆవరణలో గురువారం హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్, ఎలియన్స్ కళాశాల సంయుక్తంగా మాదక ద్రవ్యాల వినియోగం–నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. గంజాయి, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. సింహాద్రి టీఎంటీ సంస్థ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి పైలా సన్నిబాబు, ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ధనుంజయనాయుడు, డాక్టర్ బి.శ్రీనివాసరావు, ఎలియన్స్ కళాశాల చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్, బీఎన్ మూర్తి, హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, ఉపాధ్యక్షుడు కిరీటికుమార్, సహాయ కార్యదర్శి ప్రభాత్‌కుమార్, హరి, బాల శంకర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.